
ముహూర్తాల వేళ
మూఢం, ఆషాఢం ముగియడంతో శుభ ముహూర్తాలు వచ్చాయి. మార్చి నెల వరకు పెళ్లి సందడి ఉంటుంది. దీంతో పలువురికి చేతి నిండా పనులు లభిస్తున్నాయి. - 10లో


కార్లు ఢీ.. ఆరుగురికి గాయాలు
కలకడ మండలం కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లె రోడ్డులో రెండు కార్లు ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. - 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.440
రెండోరకం	రూ.290	రూ.356

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 326 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు పులివెందులకు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక



పులివెందుల రూరల్ : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం పులివెందులకు రానున్నారు. ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11గంటలకు పులివెందులకు చేరుకోనున్నారని పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఇక అక్కడ నుంచి 11.40 గంటలకు ఆయన ఇంటికి చేరుకుంటారని పేర్కొంది. రెండు రోజులు ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలలో ఆయన పాల్గొననున్నారు.

30న జాబ్‌మేళా

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మదనపల్లె జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సంస్థలు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్యలో వయసు కలిగి ఉండి, పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న యువకులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 నుంచి 20 వేల వరకు వేతనం ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 9553202509, 8897776368కు సంప్రదించాలని వివరించారు.

బాధిత కుటుంబానికి సాయం

పీలేరు : మండలంలోని బందారువాండ్లపల్లెకు చెందిన ఎం.చిన్నరాజారెడ్డి ఈ నెల 15న ఏనుగుల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. డీఎఫ్‌వో ఆదేశాల మేరకు సోమవారం రూ. 5 లక్షల చెక్కును మృతుడి భార్య సుజాతకు ఫారెస్ట్ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌వో జి.గిరినాథ్, ఏబీవో జ్యోతి పాల్గొన్నారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి



పశుగణన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి, అధికారులు

చిన్నమండెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ఆయన అధికారులతో కలిసి 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశు గణాంక వివరాలు తెలియజేయడం వల్ల ప్రభుత్వం నుంచి పాడి రైతులకు అందించాల్సిన లబ్ధి సులభతరంగా ఇవ్వవచ్చునన్నారు. ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 26 నుంచి 2025 ఫిబ్రవరి వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ఎసరు!



- జిల్లాలో 4.80 లక్షలకు పైగా ఆరోగ్యశ్రీ కార్డులు
- వైఎస్సార్, వైఎస్ జగన్ పథకమే గుర్తు రాకుండా ప్రణాళికలు
- ఇప్పటికే వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ఎన్టీఆర్ వైద్యసేవగా మార్పు
- ఆరోగ్యశ్రీ స్థానంలో ఇన్సూరెన్స్ బీమాను తీసుకొచ్చే దిశగా అడుగులు
- ఉద్యోగ భద్రతపై సిబ్బందిలో ఆందోళన
- పూర్తి స్థాయి వైద్య సేవలపై ప్రజల్లో అలజడి

సాక్షి రాయచోటి : పేదల ఆరోగ్యానికి భద్రత కరవవుతోంది. మనిషి జీవితంలో ఆరోగ్యమన్నది చాలా ప్రధానం. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పథకానికి నాంది పలుకగా.. తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొడిగింపుగా 3200కు పైగా వ్యాధులతోపాటు రూ. 25 లక్షలు అందించేలా అమలు చేశారు. ఇది సగటు మనిషి ఆరోగ్యానికి భరోసాగా మేధావులు సైతం అభివర్ణించారు. ఎలాంటి అనారోగ్య సమస్య ఎదురైనా నేరుగా కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందే పరిస్థితి ఉండేది. అయితే ప్రతికూల పరిస్థితులు ఎదురుకావడం, సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్, వైఎస్ జగన్ పేర్లను ప్రజలు విస్మరించేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇటీవలే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి పేరు మార్చి ఎన్టీఆర్ వైద్య సేవగా మార్పు చేశారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు ఆరోగ్యశ్రీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భవ తరహాలో ప్రత్యేక బీమా పథకం తీసుకురావాలని చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్న పథకానికి ఎసరుపెట్టి ఇన్స్రూ స్కీమ్‌లు తెరపైకి తెస్తే.. ఎంత మేరకు వైద్య సేవలు అందుతాయన్నది కూడా అనుమానంగా ఉంది.

ఇప్పటి వరకు ఆర్థిక సాయం కూడా..

ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని తొలగించి ఇన్స్రూ పథకానికి నాంది పలికితే పూర్తి స్థాయిలో వైద్యం అందించడం గగనమేనని మేధావులు భావిస్తున్నారు. రూ.25 లక్షల వరకు వైఎస్ జగన్ సర్కార్ వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం ఇన్స్రూ పాలసీని తీసుకు వస్తే ఒక్కొక్క రోజుకు ఎంత వ్యయం చేస్తారన్నది అంతు చిక్కడం లేదు. పైగా ఆపరేషన్ చేయించుకున్న బాధితులకు కూడా ప్రభుత్వం వైద్య సాయంతోపాటు కోలుకునే వరకు ఆర్థికసాయం అందించేవారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య బీమాపై పేద రోగుల్లో ఆందోళన కొనసాగుతోంది.

ఉద్యోగులు ఉద్యమ బాట

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సుమారు 4.80 లక్షల మందికి పైగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి సంబంధించిన కార్డులు ఉన్నాయి. 19 నెట్‌వర్క్ ఆస్పత్రుల పరిధిలో 60 మందికి పైగా పనిచేస్తున్నారు. అయితే ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి ఎగనామం పెడుతున్నారన్న సమాచారంతో.. ఉద్యోగుల్లో అలజడి మొదలైంది. పథకం మారిస్తే ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న వారి ఉద్యోగాలపై ఆందోళన నెలకొంది. ఉద్యోగుల విషయంపై స్పష్టత రాకపోవడంతో అందరూ ఆందోళన బాటపట్టారు. మంగళవారం నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని భావిస్తున్నారు.



జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించిన సమాచారం

మొత్తం మండలాలు	30
నియోజకవర్గ కేంద్రాలు	6
ఎన్టీఆర్ వైద్య సేవ కార్డులు	4.80 లక్షలు
వర్తించే వ్యాధుల సంఖ్య	3200కు పైగా
నెట్‌వర్క్ ఆస్పత్రులు	19
అందులో పని చేసే ఉద్యోగులు	60

కొనసాగుతున్న సర్వే

రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ పథకం స్థానంలో కొత్త ఇన్స్రూ పథకానికి శ్రీకారం చుట్టాలని భావిస్తున్న ప్రస్తుత సర్కారు సర్వే నిర్వహిస్తోంది. సంస్థలో పని చేసే ఉద్యోగులతోపాటు స్థానికులు, ప్రైవేటు ఆస్పత్రులు, ఇతర వర్గాలతో సర్వే చేయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రయోజనం ఉంటుందా? లేక ఇన్స్రూ ద్వారా ప్రయోజనం కల్పిస్తే ఎలా ఉంటుందన్న కోణంలో సర్వే జరుగుతోంది. మరోవైపు ఇప్పటికే ఆందోళనకు పిలుపునిచ్చిన ఉద్యోగులతో చర్చలు కొనసాగుతున్నాయి. ఏది ఏమైనా ఆరోగ్యశ్రీ పథకం ఎత్తివేతకు ప్రభుత్వ పథక రచనతో.. అందులో పనిచేసే ఉద్యోగులతో పాటు లబ్ధిదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఉద్యోగ భద్రత కల్పించాలి



17 ఏళ్లుగా ఈ పథకంలో పని చేస్తున్నాము. వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. కుటుంబ ఖర్చులకు, పెరిగిన ధరలకు ఏమాత్రం జీతం సరిపోక నెలనెలా అప్పులు చేయాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. పథక అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత, క్యాడర్ కల్పించితే మరింత పట్టుదల, ఉత్సాహంతో పని చేస్తాం.

– ప్రసన్నలక్ష్మి, జిల్లా నాయకురాలు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ సంఘం

ఉద్యోగులను కొనసాగించాలి



డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని హెల్త్ కేర్ ట్రస్ట్ పర్యవేక్షణలో కాకుండా ప్రైవేట్ ఇన్స్రూ మారుస్తున్నారు. మా భవిష్యత్తు అర్థం కావడం లేదు. ఇన్స్రూ మార్చినా ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులందరినీ యథావిధిగా తీసుకోవాలి. దీనిపై ప్రభుత్వం పూర్తి వివరణ ఇచ్చి ఉద్యోగులలో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించాలి. మా సంక్షేమం కోసం దయచూపాలి.

ప్రమీల, వైద్యమిత్ర, మదనపల్లె

సుందరంగా ఆటవీ ప్రాంగణం



అటవీ ప్రాంగణంలోని వృక్షాలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ జగన్నాథ్‌సింగ్

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉన్న అటవీ ప్రాంగణాన్ని సుందరంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీశాఖ అధికారి (రాజంపేట) జగన్నాథ్‌సింగ్ అన్నారు. సోమవారం ఆయన హార్సిలీహిల్స్‌పై విస్తృతంగా పర్యటించారు. అటవీశాఖకు చెందిన ప్రాంగణాన్ని పరిశీలించారు. జూ పార్కు, బోటింగ్, వన్య ప్రాణుల పెంపకం, ప్రకృతి అధ్యయన కేంద్రం, అటవీ అతిథిగృహాలను పరిశీలించారు. ప్రాంగణ ప్రవేశ ద్వారం, దాని ప్రస్తుత పరిస్థితిని తిలకించారు. ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిన ఆయన అటవీ అధికారులతో సమావేశమయ్యారు. ప్రాంగణ అభివృద్ధికి ఏ చర్యలు చేపట్టాలని సమీక్షించారు. ఆయన వెంట సబ్‌డీఎఫ్ఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్‌బాబు, డీఆర్ఓ మదన్‌మోహన్, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

రాయచోటి : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్ఓ కె.మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కోసం అవిశ్రాంత పోరు

- ముగిసిన సీపీఎం మహాసభలు
- ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

రాయచోటి అర్బన్ : అసమానతలు లేని జిల్లా అభివృద్ధి కోసం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కేజీఎస్ ఫంక్షన్‌హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలు సోమవారం ముగిశాయి. ప్రజా సమస్యలపై 30 రకాల తీర్మానాలు చేశారు. కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తదితరాలకు వ్యతిరేకంగా నవంబరు 1నుంచి 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహింప తలపెట్టామన్నారు. 8న మండల కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు చేయాలంటూ పిలుపునిచ్చామన్నారు. నెల రోజులుగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులు ప్రజలకు సరసమైన ధరలకు అందివ్వాలని కోరారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ నిర్వహణను పీపీపీ పేరుతో ప్రైవేటు పరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నా యన్నారు. విశాఖ ఉక్కుపరిశ్రమ పరిరక్షణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు వైఖరిని వీడాలన్నారు. తక్షణం కార్మిక సంఘాల నేతలతో చర్చించి కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎంపిక

ఈ సందర్భంగా ఏడుగురు సభ్యులతో కూడిన సీపీఎం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ కార్యదర్శిగా పోతగాళ్ళ శ్రీనివాసులు ఎన్నికయ్యారు. సభ్యులుగా రాజమ్మ, ఎ.రామాంజులు, సి.హెచ్.చంద్రశేఖర్, రవికుమార్, వి.వెంకటయ్య, పందికాళ్ళ మణిలను ఎన్నికంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలతోపాటు జిల్లా నలుమూలల నుంచి ఎన్నికైన ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నమాచార్య వ్యవసాయ కళాశాల ఏర్పాటు



రాజంపేటలో వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్న ఏయూ అధినేత చొప్పాగంగిరెడ్డి

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో అన్నమాచార్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రైవేటు వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశారు. సోమవారం అన్నమాచార్య 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వెనుక భాగం(తాళ్లపాకరోడ్డు)లో నూతనంగా నిర్మించిన భవనాలలో వ్యవసాయ కళాశాలను ఏయూ అధినేత చొప్పాగంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ రాజంపేట, రైల్వేకోడూరు పరిసర ప్రాంతాలు వ్యవసాయం, ఉద్యానవనానికి ప్రసిద్ధి అని తెలిపారు. అందువల్ల అన్నమయ్య జిల్లాలో ప్రథమంగా వ్యవసాయ కళాశాలను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీ ద్వారా ఇప్పటికే నేటి సమాజానికి అవసరమయ్యే విద్యా కోర్సులను తీసుకువచ్చామన్నారు. దేశానికి రైతే వెన్నముక అని, అటువంటప్పుడు వ్యవసాయం పడిపోకుండా అన్నమాచార్య యూనివర్సిటీ ద్వారా ఏర్పాటైన వ్యవసాయ విద్య ద్వారా.. ఎప్పటికప్పుడు నూతన పరిశోధనలు, పరిజ్ఞానం పెంపొందించుకుని మన దేశాన్ని అన్నపూర్ణ దేశమని నిరూపించేలా వ్యవసాయ విద్యార్థులు రాణించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్‌లు ద్వారకానాథరెడ్డి, డాక్టర్ నారాయణ, డాక్టర్ జయరామిరెడ్డి, ఏయూ రిజిస్ట్రార్ మల్లికార్జున, సుబ్బారావు, డాక్టర్ స్వర్ణలత, అన్నమాచార్య యూనివర్సిటీ అధ్యాపకులు, వ్యవసాయ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ఓ, ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ





డీఆర్ఓ కె.మధుసూదన్ రావు, ఆర్డీఓ శ్రీనివాసరావు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ డీఆర్ఓగా మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా వారు ఇక్కడికి వచ్చారు. సోమవారం వారి కార్యాలయాలలో విధుల్లో చేరారు. వారికి కార్యాలయ అధికారులు స్వాగతం పలికారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్ఓ, ఆర్డీఓలు

రాయచోటి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌ను డీఆర్ఓ కె. మధుసూదన్‌రావు, ఆర్డీఓ ఎ.శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్‌ను వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారికి కలెక్టర్, జేసీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్రిక్తత నడుమ చేపల వేలం వాయిదా

సాక్షి ఎఫెక్ట్..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం చెరువులో చేపల పెంపకం కోసం వేలం పాటలు నిర్వహించకుండా.. గుట్టుగా రెన్యూవల్ చేసుకోవాలని పలువురు చేసిన కుయుక్తులు బెడిసికొట్టాయి. ఈ విషయం పలు మండలాల్లో చర్చనీయాంశంగా మారడంతోపాటు సాక్షి పత్రికలో వెలువడిన కథనాలతో ప్రజలు, టెండర్లు దక్కించుకోవాలనుకున్న ఆశావహులు మరింత అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం మండలంలోని రాపూరివాండ్లపల్లి గ్రామ సచివాలయం ఎదుట చేపల పెంపకం కోసం వేలం పాటలు జరుగుతాయని అధికారులు ప్రకటించడంతో ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 11 గంటలైనా వేలంకు సంబంధించి అధికారులు ప్రజలకు సరైన స్పష్టత ఇవ్వలేదు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే అధికారులు కాలయాపన చేస్తున్నారని ప్రజలంతా వెళ్లపోయాక.. గుట్టుగా ఎక్కడ వేలం వేస్తారోనని నిర్ధారించుకున్న ఆశావహులు అక్కడే తిష్ట వేసి కూర్చున్నారు. బహిరంగ వేలం జరగాల్సిందేనని పలువురు అధికారులను నిలదీశారు. దీంతో కొద్ది సేపు అక్కడ వాదులాటలు, నిలదీతలు చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వేలం జరిగే చోట ఘర్షణ వాతావరణం నెలకొనకుండా పోలీసులు కూడా ముందస్తుగా అక్కడికి చేరుకున్నారు. అనంతరం కొద్ది సేపటికి అనివార్య కారణాల వల్ల వేలం పాటలు వాయిదా వేస్తున్నామని అధికారులు ప్రకటించారు. దీంతో వాయిదాకు కారణాలేంటో చెప్పాలని, పేరుకు మాత్రమే రంగసముద్రం చెరువని అందులో వచ్చే ఫలసాయమంతా మీ పంచాయతీకి వచ్చేటప్పుడు మా గ్రామ ప్రజలకు కనీస సమాచారం ఎందుకివ్వలేదంటూ ప్రజలంతా అధికారులను నిలదీయడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. రంగసముద్రం, రాపూరివాండ్లపల్లి గ్రామాల్లో బహిరంగంగా చాటింపు వేయించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వేలం పాటలను నిర్వహిస్తామని అధికారులు ప్రకటిస్తూ నోటీస్ బోర్డులో ప్రతిని అతికించడంతో అందరూ శాంతించి వెనుదిరిగారు.

చికెన్‌ముక్క గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

రాజంపేట : పట్టణంలోని మన్నూరులో విషాద సంఘటన చోటుచేసుకుంది. మన్నూరు సాతువీధిలో నివసిస్తున్న నంద్యాల జిల్లా సుగాలితాండకు చెందిన కిష్టయ్య, మణి దంపతుల కుమారుడు సుశాంక్(3). ఆదివారం ఉదయం చికెన్ తీసుకొచ్చి ఇంటో పెట్టుకున్నారు. తల్లి ఇంటిపనులు చేసుకుంటున్న తరుణంలో సుశాంక్ వచ్చి చికెన్‌ముక్కను నోట్లో వేసుకున్నాడు. ఈ క్రమంలో ఊపిరాడక సొమ్మసిల్లాడు. వెంటనే తల్లి, తండ్రి ప్రాంతీయవైద్యశాలకు తీసుకొచ్చారు. అప్పటికే బాలుడి ఊపిరి ఆగిపోయింది.

మెనూ.. మార్పు!

- మధ్యాహ్న భోజనంలో మార్పులపై కసరత్తు
- పాఠశాలల నుంచి సూచనలు అడిగిన ప్రభుత్వం
- నివేదికలు పంపిన విద్యాశాఖ అధికారులు



మదనపల్లె మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం (ఫైల్)

మదనపల్లె సిటీ : జిల్లాలోని 2,201 ప్రభుత్వ పాఠశాలల్లో 1,36,464 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకంలో ప్రతి రోజూ మెనూను అమలు చేసింది. ఆ ప్రత్యేక మెనూను జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించేవారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే గోరుముద్ద పథకం పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్చింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపింది.

అత్యుత్సాహం

మధ్యాహ్నభోజన పథకం మెనూలో మార్పులు చేయాలని ఎవరూ అడగనే లేదు. అయితే అత్యుత్సాహంతో కూటమి ప్రభుత్వం తల్లిదండ్రులు, విద్యార్థుల కోరిక మేరకు మెనూలో మార్పులు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రచారం చేస్తోంది. ఇటీవల మెనూలో మార్పులకు సంబంధించి నివేదికలు సిద్ధం చేసి పంపాలని విద్యాశాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాల మేరకు సీనియర్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు, మధ్యాహ్నభోజన కార్మికులను సభ్యులుగా చేర్చి, మెనూలో చేయాల్సిన మార్పుల అంశంపై చర్చించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

అమలు కంటే మార్పులపైనే దృష్టి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మార్పులు చేసి గొప్పలు చెప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ బాగానే ఉన్నప్పటికీ మార్పులకు కుట్ర చేస్తున్నారు.

రుచికరంగా మారింది వైఎస్సార్‌సీపీ పాలనలోనే...

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే మధ్యాహ్న భోజన పథకంలో రోజుకో మెనూను ప్రవేశపెట్టింది. రుచికరమైన భోజన అందించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ప్రభుత్వ పాఠశాలల్లో రుచికరమైన, నాణ్యమైన ఆహారం పెట్టేందుకు పాఠశాలల్లో సెంట్రలైజ్డ్ కిచెన్‌లను సైతం నిర్మించింది. సోమవారం నుంచి శనివారం వరకు రోజుకు ఒక మెనూను అమలు చేసింది.

2019కి ముందు

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 2019 ముందు టీడీపీ పాలనలో ప్రతి రోజూ ఒకే మెనూ అమలయ్యేది. ఎన్ని ఏళ్లు గడిచినా ఆ మెనూలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రతి రోజూ ఒకే మెనూను అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సగానికి సగం మంది తినేందుకు ఆసక్తి చూపేవారు కాదు.

2019 తర్వాత

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో వినూత్న మార్పులు తీసుకొచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఇందుకోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకంలో రోజుకో మెనూ అమలుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టడం గత ప్రభుత్వంలో మొదలు పెట్టారు.

ముంచుకొస్తోంది.. ముహూర్తాల వేళ

- ప్రారంభమైన పెళ్లి సందడి
- పలువురికి చేతి నిండా పనులు

పెళ్లి ముహూర్తాలు ఇలా..

నవంబర్ నెలలో (కార్తీకమాసం)
3,7,8,10,13,14,16,17,20,22,27,28

డిసెంబర్ నెలలో (మార్గశిరమాసం)
4,5,6,7,8,11,12,14,15,20,21,26,27,28

జనవరి 2025 : మాఘమాసం
31

ఫిబ్రవరి: మాఘమాసం
2,6,7,8,9,12,13,14,15,16,21,23,26

మార్చి : ఫాల్గుణమాసం
2,6,9,12,15,16


పెళ్లి కళతో కల్యాణ మండపం

మదనపల్లె సిటీ : వివాహ వేడుక ప్రతి ఒక్కరి జీవితంలో ఓ మధురానుభూతి. అందుకే అందరూ మెచ్చుకునేలా, పది కాలాలు గుర్తుండిపోయేలా వైభవంగా జరుపుకోవాలని భావిస్తారు. అందుకు తగ్గట్టే ఏర్పాట్లు చేసుకుంటారు. మూఢం, ఆషాఢం ముగియడంతో మళ్లీ ముహూర్తాల సందడి మొదలైంది. మార్చి నెల వరకు వివాహ ముహూర్తాలు ఉన్నాయి. జనవరిలో సంక్రాంతి పండుగ ఉండటంతో ఈ నెలలో ముహూర్తాలు ఉండవు. ఫిబ్రవరి నుంచి మార్చి వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. దీపావళి తరువాత పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో ఉమ్మడి కడప జిల్లాలో పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ఎక్కడ చేసినా పెళ్లి సందడి కనిపిస్తోంది. ఈ మూడు నెలల్లోనే జిల్లాలో వేల జంటలు ఒక్కటవుతున్నాయి. పెళ్లి బాజాలు మోగుతున్న నేపథ్యంలో అనేక మందికి చేతి నిండా పనులు లభిస్తున్నాయి.

వీరంతా బిజీ..
మంగళ వాయిద్యాలు, ట్రావెల్స్, పూల అలంకరణ, షామియానాలు, ఫొటోగ్రాఫర్లు, బ్యూటీషియన్లు, వంటల నిర్వాహకులు, ఆర్కెస్ట్రా, పురోహితులు, ఈవెంట్ మేనేజర్లకు చేతి నిండా పని దొరుకుతుంది.

వారెవ్వా అనిపించేలా..
పెళ్లంటే ప్రత్యేకంగా కనిపించాలని అంతా భావిస్తుంటారు. వధూవరులే కాదు కుటుంబీకులు, బంధువులు అంతా షాపింగ్ మాల్‌లకు వరుస కడుతున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటితో పాటు రాజంపేట, మదనపల్లె పట్టణం నీరుగట్టువారి పల్లెలో పట్టుచీరల షాపులు కిటకిటలాడుతున్నాయి. కాబోయే జంటలు, వారి కుటుంబ సభ్యులు షాపింగ్ కోసం ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు వస్తూనే ఉంటున్నారు.

పూల అలంకరణకు మారుపేరు..
పూల దుకాణాల్లో సందడి నెలకొంది. మల్లె, బంతి, చామంతి, గులాబీ, పూల దండలు ఇలా విభిన్నంగా తయారుచేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. మదనపల్లెకు చెందిన పూల వ్యాపారులు బెంగళూరు నుంచి అన్ని రకాల పూలను టోకుగా తీసుకువస్తున్నారు.

అందంగా కనిపించేందుకు..
వివాహాలు, శుభ కార్యాలు ఉన్నాయంటే చాలు ఒక రోజు ముందే బ్యూటీషియన్లు వారింటికి చేరుకుని అందంగా సిద్ధం చేస్తారు. పల్లె నుంచి పట్టణాల వరకు బ్యూటీపార్లర్లు వెలిశాయి. పెళ్లి తంతులోని అన్ని అంశాలను ప్యాకేజీ కింద ముందే మాట్లాడుకుంటామని చెబుతున్నారు. ఒక పెళ్లి ప్యాకేజీ రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుందన్నారు.

ముస్తాబైన కల్యాణ మండపాలు..
జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరులతో పాటు పలు పట్టణాల్లో కల్యాణ మండపాలను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. కల్యాణ మండపాల ధరలు రూ.50 వేల నుంచి మొదలై రూ.లక్ష వరకు పలుకుతున్నాయి. పుట్టిన రోజు వేడుకలు, చీరల వేడుకలు, అపూర్వ సమ్మేళనాలు, పదవీ విరమణ, ఇతర కార్యక్రమాలు సైతం నమోదు చేసుకున్నారని ఓ కల్యాణ మండప యజమాని తెలిపారు.

బంగారు కాలం..
పెళ్లంటే బంగారం కొనుగోళ్లు తప్పనిసరి. ధర ఎంత పెరిగినా కొనుగోళ్లు తగ్గడం లేదు. ప్రధాన పట్టణాల్లో బ్రాండెడ్ బంగారు షాపులు వెలిశాయి. మారుతున్న ట్రెండ్‌కు తగ్గట్టుగా ఆభరణాలను ఎంపిక చేసుకుంటున్నారు. చాలా మంది మూడు నెలల ముందే వచ్చి అల్బమ్‌లోని ఆభరణాలను ఎంపిక చేసుకుని చేయించుకుంటున్నట్లు ఓ బంగారు ఆభరణ దుకాణ యజమాని తెలిపారు.

ఈవెంట్స్ మేనేజర్లు.. ఫొటోగ్రాఫర్లు..
పెళ్లి అందరికి గుర్తుండిపోయేలా చేసే ఫొటోగ్రాఫర్లకు మంచి గిరాకీ ఉంది. ఈవెంట్ మేనేజర్ల సంస్కృతి బాగానే ఉంది. దీంతో పాటు పెళ్లిలో బాజా భజంత్రీలు, సన్నాయి సవ్వడులు, డీజే తప్పనిసరి. డిసెంబర్ వరకు ముహూర్తాలు ఉండటంతో ముందుగానే బుక్ చేసుకున్నారని ఓ బృందం తెలిపింది. ఒక పెళ్లికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుందంటున్నారు.

ముహూర్తాలు మొదలయ్యాయి
ఈనెల నుంచి వచ్చే మార్చి వరకు వివాహాలు జరిపించేందుకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. శుభ ముహూర్తాలు మళ్లీ మొదలయ్యాయి. అధిక సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే వధూవరులు, బంధువులు వివాహాలకు ముహూర్తాలను ఖరారు చేసుకున్నారు.


- సాయిచక్రవర్తి, వేదపండితులు, మదనపల్లె

నచ్చిన రీతిలో డెకరేషన్
కల్యాణ మండపాల నుంచి స్వాగత తోరణాల వరకు నచ్చిన రీతిలో డెకరేషన్ చేస్తున్నాం. బెంగళూరు, కడప, తమిళనాడు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పూలు, డెకరేషన్ సామగ్రి ముందుగా తెప్పించి సెట్టింగ్ వేస్తున్నాం.


- ఎంబీఎస్ బాషా, పూలవ్యాపారి, మదనపల్లె

క్లుప్తంగా

డీఆర్‌ఓ, ఆర్డీఓల సేవలు ప్రశంసనీయం


డీఆర్‌ఓ, ఆర్డీఓలను సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : అన్నమయ్య జిల్లాకు డీఆర్‌ఓగా పని చేసిన సత్యనారాయణరావు, ఆర్డీఓ రంగస్వామి సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి అనకాపల్లికి బదిలీపై వెళ్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణరావు, రాయచోటి ఆర్డీఓ రంగస్వామిల బదిలీ సందర్భంగా జిల్లా కలెక్టర్, జేసీ, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సహదేవరెడ్డి, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం, సివిల్ సప్లై డీఎం శివరాం, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, పీడీడీఆర్‌డీ సత్యనారాయణ, జిల్లా టూరిజం శాఖ అధికారి నాగభూషణం, జిల్లా గిరిజన శాఖ అధికారి తేజశ్వనీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ పకోడా వ్యాపారిపై బీరు బాటిల్‌తో దాడి

మదనపల్లె : చికెన్‌పకోడా అప్పు ఇవ్వనని చెప్పినందుకు వ్యాపారిపై బీరు బాటిల్‌తో దాడి చేసిన ఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండకు చెందిన హమీదుల్లా కుమారుడు ఖాదర్‌బాషా(40) పుంగనూరు రోడ్డులోని వైన్‌షాపు సమీపంలో చికెన్ పకోడా దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి బసినికొండకు చెందిన సన్నీ మద్యం తాగేందుకు అక్కడకు వచ్చి చికెన్ పకోడా అప్పు ఇవ్వాల్సిందిగా అడిగాడు. అయితే అప్పు ఇచ్చేది లేదని ఖాదర్‌బాషా తెగేసి చెప్పడంతో దీంతో ఆవేశానికి లోనైన సన్నీ బీర్‌బాటిల్‌తో ఖాదర్‌బాషాపై దాడి చేశాడు. దాడిలో ఖాదర్‌బాషా తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని దంపతులకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని భార్యాభర్తలు గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. రాయచోటికి చెందిన ఖాదర్‌వలీ(23), అతడి భార్య ఆయేషా(20) ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వెళ్లారు. తిరిగి అదే వాహనంలో రాయచోటికి వెళుతుండగా, మదనపల్లె బైపాస్‌రోడ్డు నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం వీరిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం

రాయచోటి : ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్టపరిధిలో విచారించి ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సానుకూలంగా స్పందించారు.

రైలు ప్రయాణికులపై చిరువ్యాపారుల దాడి

మదనపల్లె : రైలులో వెళుతున్న భార్యాభర్తలపై మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్ వద్ద చిరువ్యాపారులు దాడిచేసిన ఘటన సోమవారం ఉదయం జరిగింది. అనంతపురం రాఘవేంద్రనగర్‌కు చెందిన భార్యాభర్తలు సురేష్, రేణుకలు తిరుపతి వెళ్లి తిరుగు ప్రయాణంలో 07656 తిరుపతి–గుంతకల్లు స్పెషల్ ఫేర్ రైలులో అనంతపురం బయలుదేరారు. రైలులో చిరువ్యాపారులతో చిన్నపాటి వాగ్వాదం కాస్తా గొడవగా మారింది. దీంతో చిరువ్యాపారులు కొంతమంది, భార్యాభర్తలపై మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్(సీటీఎం)లో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను స్థానికంగా గమనించిన కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అయితే ఘటనకు సంబంధించి అటు రైల్వే, ఇటు మదనపల్లె పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

బడికాయలపల్లె వీఓల లావాదేవీలపై విచారణ

బి.కొత్తకోట : మండలంలోని బడికాయలపల్లె గ్రామానికి చెందిన రెండు గ్రామ సమాఖ్య సంఘాల పరిధిలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై డీఆర్‌డీఏ జిల్లా అధికారుల బృందాలు సోమవారం విచారణ ప్రారంభించాయి. తొలుత మండల సమాఖ్య కార్యాలయంలో దీనికి సంబంధించిన సంఘమిత్రలు, ఏపీఎం, సీసీలు, సిబ్బందితో సమావేశం నిర్వహించి రికార్డులు, అవినీతి ఆరోపణలపై సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో గ్రామ సమాఖ్యకు ఒక అధికార బృందాన్ని పీడీ నియమించారు. ఈ రెండు బృందాలు క్షేత్రస్థాయిలో వెళ్లి సంఘాల సభ్యులను కలిశారు. సంఘాలకు మంజూరైన నిధులు, తిరిగి చెల్లింపులు, ఇతర రుణాలు, వాటి స్థితిగతులపై ఆరా తీశారు. ఈ విచారణ ఇంకా రెండు రోజులు కొనసాగనుంది.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

రాయచోటి : రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా వైద్యశాఖ, మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం, ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో 120 మంది పోలీసులు రక్తదానం చేయడం శుభ సూచకమన్నారు. రక్తదానం చేయడం వలన ప్రాణదానం చేసినట్లేనన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, గర్భిణులకు ప్రసవ సమయంలో, ఇతర అనారోగ్య పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను, రక్తహీనత కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, వారికి రక్తాన్ని అందించాలనే లక్ష్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. రక్తదానం చేసిన పోలీసులను ఎస్పీ అభినందించి వారికి ప్రశంసాపత్రాలు, పండ్లు అందజేశారు.

వైద్యశిబిరం : పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. డాక్టర్ల బృందానికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ డేవిడ్ సుకుమార్, ప్రభుత్వ వైద్యులు ఎన్‌ఆర్ భాస్కర్‌రెడ్డి, షేక్.సహీనా, ఎస్.కరీముల్లాబాషా, ఎస్.ఖదీర్‌బాషా, ఎన్.ప్రశాంతి, ఎన్.ధరణికుమార్, ఎస్.సయ్యద్ షుకూర్, టి.రంజిత, దేవీప్రశాంతి, జి.విష్ణువర్ధన్, ఎస్‌బీ సీఐ చలపతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మెగా రక్తదానం, ఉచిత వైద్యశిబిరాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

అపార్ ఐడీ కార్డులు త్వరితగతిన పూర్తి

ఓబులవారిపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముక్కవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అపార్ ఐడీ కార్డులకు సంబంధించి పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2020 జాతీయ విద్యా విధానం ప్రకారంగానే వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడెంటిటీ కార్డు అపార్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. తద్వారా విద్యార్థులకు అన్ని విధాలా ప్రయోజనం కలుగుతుందన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాల భూమి కబ్జాపై పరిశీలన
పాపిరెడ్డిపల్లి దళితవాడ ప్రాథమిక పాఠశాల ప్రహరీ కబ్జాపై జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవీ పరిశీలించారు. ఈ కబ్జాపై గ్రామస్తులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు పరిశీలించారు. రికార్డులు పరిశీలించి పాఠశాల ప్రాంగణంలో దాదాపు ఐదు సెంట్ల మేర స్థలం కబ్జా అయినట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రెడ్డయ్య, డీటీ రెడ్డి ప్రసాద్, ఆర్‌ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కార్డులకు సంబంధించి పాఠశాలలో పరిశీలిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రసవత్తరంగా ఎస్‌జీఎఫ్ అండర్ -17 కబడ్డీ పోటీలు

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ అండర్–17 కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. లీగ్‌మ్యాచ్‌లలో భాగంగా సోమవారం నిర్వహించిన పోటీలో బాలికల విభాగంలో వైఎస్సార్ జిల్లా జట్టుపై విశాఖపట్టణం జట్టు 9 పాయింట్లతో గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే తూర్పుగోదావరిపై కర్నూలు జట్టు 16 పాయింట్లతో ప్రకాశంపై గుంటూరు 2 పాయింట్లతో పశ్చిమగోదావరిపై శ్రీకాకుళం 26 పాయిట్లతో గెలుపొందింది.



బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమాండెంట్ డి. నాగేశ్వరప్ప మాట్లాడుతూ బెటాలియన్ లోని ఆఫీసర్స్, బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు, వృద్ధులు, చిన్న పిల్లలు 189 మంది వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. వారికి దంతవైద్యుడు డాక్టర్ గణేష్‌కుమార్‌రెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ ఎల్. ఆనంద్, పీడీయాట్రిక్ డాక్టర్ మురళీకృష్ణ, గైనకాలజిస్టు డాక్టర్ చరిష్మ, కంటి వైద్యురాలు డాక్టర్ యోగ్యా, రిమ్స్ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్ర, బెటాలియన్ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ దివ్యరాణి, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కడప రిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 29 మంది బెటాలియన్ పోలీసు సిబ్బంది రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎం. థియోఫిలాస, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, యూనిట్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమాండెంట్ డి. నాగేశ్వరప్ప

మా పంచాయతీలో మీకేం పని?

తమ్ముళ్ళ మధ్య కుదరని సయోధ్య

పెద్దతిప్పసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా కూడా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్ల నడుమ మాత్రం ఇంకా సయోధ్య కుదరలేదు. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఇంకొకరు విమర్శలు చేసుకుంటూ ఆత్మ సంతృప్తి పొందుతున్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల విషయంలోనూ ఇలాంటి ఘటనలే చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల క్రితం మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నవాబుకోట పంచాయతీలో టీడీపీకి చెందిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి తుమ్మరకుంట పంచాయతీలోని ఎగవ బండమీదపల్లిలో రూ.10 లక్షల అంచనాతో సిమెంటు రోడ్డు వేసేందుకు ఉపక్రమించాడు. ఈ నేపథ్యంలో సదరు నాయకుడు రెండు రోజుల క్రితం రోడ్డు వేసే ముందు రోడ్డులో మట్టిని తోడి చదును చేసేందుకు జేసీబీతో పాటు ట్రాక్టర్లతో బండమీదపల్లికి వెళ్లాడు. రోడ్డు పనులు చేస్తుండగా ఇదే పంచాయతీకి చెందిన పలువురు సీనియర్ టీడీపీ నాయకులు పనులను అడ్డుకున్నట్లు సమాచారం. అంతేగాక. పక్క పంచాయతీకి చెందిన నీకు మా ఊళ్లో ఏం పని,, ఇదే పార్టీలో మీ సీనియర్లుగా మేమిక్కడ లేమా, తక్షణం వెంట తెచ్చిన వాహనాలతో వెళ్లిపోండి, రోడ్లు వేయాలనుకుంటే మీ పంచాయతీలో వేసుకోమని కరాఖండిగా చెప్పడంతో సదరు వ్యక్తి వాహనాలతో వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా రోడ్డు పనులు మంజూరైనా కూడా పనులు ఇంకా ఎందుకు చేపట్టలేదంటూ అధికారులు నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పనులు చేపట్టాలనుకున్న నాయకులు ఊరికే ఉన్నా బాగుండేది అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెండు కార్లు ఢీ

ఆరుగురికి గాయాలు


రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


కారులో ఇరుక్కుపోయిన రాఘవేంద్ర


గాయపడిన ప్రభాకర్, మహేష్, కిషోర్, అనిల్‌కుమార్

కలకడ : రెండుకార్లు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. సోమవారం చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై కలకడ మండలం, కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లెరోడ్డు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కలకడ సీఐ గురునాథ్, పోలీసుల కథనం మేరకు.. కర్నూలు జిల్లా నందిగంకు చెందిన రాఘవేంద్ర, ప్రభాకర్, మహేష్, కిషోర్, అనిల్‌కుమార్‌లు కర్నూలు నుంచి అన్నమయ్య జిల్లా కలికిరి మండలం, మహల్ గ్రామానికి టీఎస్ 07హెచ్‌ఎఫ్ 7985 నంబరు గల కారులో బయలుదేరారు. 39హెచ్ 5951 నంబరు గల కారులో రాజంపేటకు చెందిన జగదీష్ పీలేరు నుంచి రాయచోటి వైపు వెళుతున్నారు. ఇదే సమయంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక కారులోని ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవింగ్ చేస్తున్న రాఘవేంద్ర కారులోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు కారు డోర్ తొలగించి క్షతగాత్రులను బయటకు తీశారు. మరోకారులోని జగదీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ గురునాథ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు

రాయచోటి : వాల్మీకిపురం ఎస్‌ఐ దురుసు ప్రవర్తన పట్ల వాల్మీకిపురం మండల కేంద్రంలోని గాంధీపేట దళితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దళితులైన రఘుపట్ల ఎస్‌ఐ అసభ్యకర పదజాలంతో దూషించి అవమానపరిచారని ఎస్పీకి అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ సూచన మేరకు సొంత అవసరాల కోసం ట్రాక్టర్‌తో ఇసుక తోలుకోవడానికి ఎస్‌ఐను అనుమతి కోరితే ఇష్టం వచ్చిన రీతిలో దూషించడమే కాకుండా స్టేషన్ నుంచి బయటకు పంపించారన్నారు.

కరెంటు షాక్‌తో భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర గాయాలు



గాయపడిన ఇమ్రాన్, నజీర్‌బాషా

మదనపల్లె : కరెంటు షాక్‌తో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. పాపేపల్లి పంచాయతీ గుడిసివానిచెరువుకు చెందిన బాబాఖాన్ కుమారుడు ఇమ్రాన్ (25), అదే పంచాయతీ బి.తురకపల్లికి చెందిన ఇమామ్ సాహెబ్ కుమారుడు నజీర్‌బాషా (27) భవన నిర్మాణ పనులలో భాగంగా కమ్మీ పనిచేస్తూ జీవిస్తున్నారు. సోమవారం పెద్దమండ్యం సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద నిర్మాణంలో ఉన్న భవనానికి పై కప్పు (మోల్డింగ్) వేసేందుకు కమ్మీ చుడుతుండగా ప్రమాదశాత్తు భవనంపై వెళుతున్న 32 కె.వి. విద్యుత్‌లైన్‌కు కమ్మి తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ప్రమాదంలో ఇమ్రాన్, నజీర్ బాషా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు చికిత్స అందించిన అనంతరం ఐసీయులో చికిత్స పొందుతున్నారు.